# తాడూ - పామూ

మెలికలు తిరుగుతూ పోతున్న ఆవీధిలో మధుమూర్తి హాస్పిటల్ వెదుకుతూ పోతూంటే, అపర్ణ వీధి వాకిట్లో మల్లెపూలు కొని చెంగున పోయించుకుంటూ నన్ను చూసి పిలిచింది.

మొదట్లో ఆమెని పోల్చుకోవటం కొంచెం కష్టమే అయింది. ఆనాటి నా అపర్ణ- అపరంజి బొమ్మ - సూర్యుడి బంగారు కిరణంలా గాలి అలలకున్న చేతనత్వంతో నన్ను పలకరించే చలాకీ పిల్ల, సంసారపు బరువు బాధ్యతలు బాగా ఒంటపట్టినట్లు స్థూలమయింది.

లోపలకు వెళ్ళి కూర్చున్నాను. పైన ఫాను గిర్రున తిరుగుతూంది. దారపు బంతి తెచ్చుకుని మాల కడుతూ మాట్లాడుతోంది అపర్ణ.

''నేను చూసి పిలవకపోతే మా ఇంటికి వచ్చేవాడివి కాదన్నమాట?'' నిష్ఠూరం వేస్తోంది.

''మీరిక్కడ ఉన్నట్లు విన్నా కాని, మీ ఇల్లు తెలిస్తే కదా రావటానికి?'' అన్నాను.

''ఊం తెలుసుకోదలుచుకుంటే వెయ్యి మార్గాలు. కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా! అసలు నువ్వు మమ్మల్ని మరిచిపోయావు.''

''లేదు. నిన్నెలా మరిచిపోతాను? ఐతే వెంటనే గుర్తుపట్టలేకపోయాను.''

''పోన్లే. పెళ్ళి చేసుకున్నావటగా? ఎంతమంది పిల్లలు? మీ ఆవిణ్ణి మాకు చూపించనే లేదు.''

''ముగ్గురు. పెద్దమ్మాయి టెన్త్‌క్లాసు చదువుతోంది. తరువాత వాడు ఎనిమిదో క్లాసు, చిన్నవాడు నాలుగు చదువుతున్నారు. మా పెద్దమ్మాయి పేరు నీ పేరే - అపర్ణ.''

''నయం... ఇంకా పూర్తిగా మరిచిపోలేదు'' అన్నది నవ్వుతూ.

మనోహర సుందర హర్మ్యం శిథిలమైనా, ఎక్కడో అందం తొంగిచూస్తూనే ఉంది.

మాటలు దొర్లుతున్నాయి. ''ఉద్యోగమేమిటో?'' అడిగింది అపర్ణ.

''మెడికల్ రిప్రజెంటేటివ్... ఎప్పుడూ క్యాంపులే, ఊళ్ళు తిరగటమే సరిపోతోంది''

''మీ ఆవిడెట్లా ఊరుకొంటోంది... నేనైతేనా....''

''అందుకనే నువ్వుకాలేదుగా...'' మేమొకసారి జీవితంలో ప్రేమించుకున్నట్లు గుర్తు చేయాలనే పైశాచికత్వం మాట్లాడించింది నన్ను.

అపర్ణ తల పంకించి ఊరుకొన్నది. పాత నిజం కాదనలేకా, ఇప్పటి నిజం మరపురాకా, పరదాల

మాటున దాగిన ఆడదే అయింది. తెర మరుగుల్లో మాట్లాడుతూంది ఆరిందా అపర్ణ. పరదాల్లో ఆడుకుని ఓడిపోయిన నేను, నగ్నత్వంలో శిలాకర్కశపు అస్తిత్వాన్ని ఇంకా గుర్తించ నిరాకరిస్తూనే ఉండిపోయాను.

''ఎవరూ?'' పక్కింటి బామ్మగారు కాబోలు, దళసరి కళ్లద్దాల మీద చెయ్యి పెట్టుకుని అడుగుతూంది.

''మా బావండీ!'' అపర్ణ జవాబు. పాము కుబుసం విడిచి చరచరా పాకిపోయినట్లో అనుభూతి.

''మీ అమ్మాయికెన్నేళ్ళు, పెళ్ళీడుకొచ్చిందా...?''

''పదిహేనేళ్లగా.... అయినా, సంబంధాల కోసం నేనేం వెతకటంలేదు... మీ అబ్బాయికి చేసుకోపోతేకదా...''

''మరీ కట్నం అదీ - మా వాడు మెడిసిన్ చదువుతున్నాడు - దాచి పెట్టావు కదా!''

''నా దగ్గర కూడా కట్నం తీసుకుంటావేం... అలా అయితే మా అమ్మాయిని మీవాడికివ్వనే ఇవ్వను'' అన్నాను.

''ఏం?'' అన్నది హేళనగా నవ్వుతూ అపర్ణ.

''మనం పెళ్ళి చేసుకుంటే మీ నాన్నదగ్గర నేనేం తీసుకునేవాణ్ణి...?''

''హుష్ గోల.... మా పెద్దాడొస్తున్నాడు?''

అపర్ణ పెద్ద కొడుకు శేఖరం కాలేజీ నుంచి కాబోలు వచ్చాడు. అపర్ణ కొడుక్కి నన్ను పరిచయం చెయ్యటానికి పెద్ద ఇబ్బందే పడింది. అపర్ణ నాకు వేలు విడిచిన మేనమామ కూతురు. చుట్టరికం దూరమే అయినా, మా హృదయాల్లోని చిన్ననాటి స్పందన, ఈనాటికీ వీడని దగ్గరితనం ఏమని వివరిస్తుంది?

కొడుకు కాఫీ టిఫిన్లతోపాటు అతిథి సత్కారమూ చేసింది అపర్ణ. శేఖరం టెన్నిస్ రాకెట్ ఊపుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. ఈలోపల తమ ఫామిలీ ఫోటో ఆల్బమ్ తీసి నాకిచ్చి, చూస్తూ కాలక్షేపం చేయమంది అపర్ణ.

నల్లకాగితాలు తిరిగి పోతున్నాయి. అపర్ణ యౌవన వసంతాలు తరిగి పోతున్నాయి.

''నీ ఫోటో ఒకటి ఇవ్వరాదూ నాకు?'' అన్నాను, అపర్ణ - నా అపరంజిగా ఉన్నప్పటి ఫోటో మనసుపడి.

''వద్దులే, బాబూ! ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?''

ఓ క్షణం మనసు పనిచెయ్యలేదు. ఆనాడు నాతో లేచిరావటానికి సిద్ధపడిన అపర్ణ మాటలేనా అనిపించింది. ఇంకోసారి అడిగితే ఆమె ఫోటో ఇచ్చేస్తుంది. అయినా, అడగబుద్ధి కాలేదు నాకు.

బ్రతుకును నేర్పుగా తస్కరించటం ఆమె అవసరం. నేను కాదనలేదు.

''ఇక వెళతాను'' అన్నాను. తప్పదు ఆమెను విడిచి వెళ్ళక. తిరిగి రాలేనంత దూరం జీవితంలో నడిచి వెళ్ళిన తరువాత వియోగం అనివార్యం.

''అప్పుడేనా ... మావారొస్తారు ... ఉండు, వెళుదువుగాని.''

''ఊహూఁ... వెళతాను.'' ఆమెని తప్ప ఇంకెవర్నీ ఆ ఇంట్లో చూడబుద్ధికాని, బ్రతక చేతకానితనం నాది.

ఆమె దొంగ... నేర్పరి అయిన తస్కరిణి.... దొంగతనం సరిగ్గా చేయటం చేతకాక, నేర్పులేక పట్టుబడ్డాడు. మరి శిక్షించకేమి చేస్తారు? నేనలాంటి దొంగనా?

ఆమె వెళ్ళనివ్వలేదు. అంతకంటే నేను వెళ్ళలేకపోయాననటమే బాగుంటుందేమో? ఇంతలో ఆమె 'వారు' వచ్చారు. అతనిప్పుడు నన్ను గుర్తించేట్టులేదు.

''మా సుందరమ్మత్త కొడుకండీ.... శంకరం... గుర్తుపట్టలేదూ...''

''అయాంసారీ... బాగున్నారా.... చూసి చాలా రోజులయింది.''

మళ్ళీ కాఫీలూ, పింగాణీ కప్పులూ, సాసర్ల మృదుల ధ్వనిలా ఆమె మాటలూ. పొద్దు వాటారి పోయింది. నాకు మధుమూర్తిని కలవాలన్న తహతహ ఎక్కువయింది. అయితే, అపర్ణ నేను భోజనం చేసిందాకా వదిలిపెట్టలేదు.

''మన అబ్బాయికి వాళ్ళమ్మాయిని చేసుకోమంటున్నాడండీ శంకరం.'' భోజనాలదగ్గర ప్రస్తావించింది అపర్ణ.

''చూద్దాం... తొందరేముంది .... మనవాడి చదువు పూర్తవాలి కదా...'' ఆయన తేల్చేశాడు.

భోజనాలయినాయి. వక్కనములుతూ, పేపరు తీసుకు కూచున్నారు ఆఫీసరుగారు. ఆ మాటలూ, ఈ మాటలూ మాట్లాడుకున్నాం కాసేపు.

'వెళతా'నని ఆయనకు చెప్పి బయలుదేరాను. అపర్ణ వాకిటిదాకా సాగనంప వచ్చింది.

''ఆయనకు వాళ్ళ చెల్లెలి కూతుర్ని కొడుక్కి చేసుకోవాలనుంది. అయినా, ప్రయత్నిస్తాను శంకరం'' అన్నది అపర్ణ.

''ఎందుకో...?'' అన్నాను.

నవ్వింది అపర్ణ. ఆమె తెల్లని పళ్ళు ప్రతిఫలించాయి. మా హృదయాల్లోని ఓ కాంతి కిరణం మా వారసుల్లో ప్రతిఫలించాలనేమో నవ్వింది అపర్ణ.

''మొద్దూ!'' అని వాకిటి చీకటిలో చెక్కిలిపై మృదువుగా తట్టింది.

చీకటిలో మధుమూర్తి ఇల్లు వెతుక్కుంటూ బయలుదేరాను. ఎనిమిది గంటల

ప్రాంతమయిందేమో, అయినా ఎక్కువ ప్రయాస లేకుండానే వాడి ఆసుపత్రి కనుక్కోగలిగాను. వాడు ఆ ఊళ్లో పేరు మోసిన డాక్టరవటమే కారణం.

పెద్ద బంగళా అది. ముందు భాగంలో అతని ఆసుపత్రి, వెనుక ఇల్లు. రాత్రి ఎనిమిది గంటలయినా డాక్టరుగారి కన్సల్టేషన్ కోసం పెద్ద క్యూలో జనం కూర్చునే ఉన్నారు. డాక్టరుగారి గదిలోకి జనం మూకుమ్మడిగా జొరబడకుండా కన్సల్టేషన్ గదిముందు కాపలా కాస్తున్న భీముణ్ణి తప్పుకొని లోపలకు ప్రవేశించటం పెద్ద ప్రయత్నమే అయింది నాకు.

''అరే, నువ్వట్రా శంకరం... రా... కూర్చో.'' ఆహ్వానించాడు మధుమూర్తి. ''ఎప్పుడూ రావటం... ఏమిటి కథ.. ఆఁ'' పేషెంట్‌ని పరీక్ష చేసి స్టెత్ మెళ్లోకి జార్చుకుంటూ, ప్రిస్క్రిప్షన్ వ్రాస్తూ ప్రశ్నించాడు మధుమూర్తి.

అయితే, నా సమాధానం వినేంత తీరికలో లేడు వాడు. ప్రిస్క్రిప్షన్ కాగితం రోగికిస్తూ, ''ఈ గోలీలు రోజూ సాయంత్రం భోజనం చేసిన తరువాత వేసుకోండి. ఈ టానిక్కు రోజూ పొద్దున్నా, సాయంత్రం ఓ చెంచాడు. రోజూ వచ్చి ఇంజెక్షన్ చేయించుకోండి'' అని చెప్తున్నాడు.

మధుమూర్తి ఏం పెద్దగా మారలేదు. అదివరకు లేని కళ్ళజోడు వాడి ముఖానికి ఠీవి తెచ్చింది. సన్నగా ఫ్రెంచి కట్ మీసాలు. దబ్బపండులా మెరిసిపోతున్నాడు మనిషి.

మొదటి రోగి వెళ్ళి, తరువాత రోగి స్టూలు ఆక్రమించుకునేంతలో మళ్ళీ సంభాషణ సాగింది.

''పిల్లలూ, అంతా కులాసా...''

''కానీ... నీ పనికానీ... తీరిగ్గా మాట్లాడుకుందాం'' అన్నాను.

పైన పంఖాతోపాటు నా ఆలోచనలు తిరుగుతున్నాయి గిర్రున. ఎన్నో సంవత్సరాల తరువాత ఈవేళ చూశాను అపర్ణను. అప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడా! అప్పటి నా అపరంజికి ఈ వేళ నన్ను ఒక్క రోజుకూడా బలవంతం చేసి తన ఇంట్లో ఉంచుకునే స్వేచ్ఛ లేదు. మేం అంత దూరమయ్యాం. రైలు ప్రయాణికుల్లా ఎవరి స్టేషన్లలో వాళ్ళం దిగిపొయ్యాం. అపర్ణను నేనే పోగొట్టుకున్నాను. ఆడ వాళ్ల పరిస్థితిని గుర్తించినంత తేలిగ్గా మగవాళ్ళు గుర్తించలేరు. నేనప్పుడు బి.ఎస్.సి. చదువుకునే రోజులు. అపర్ణ నన్ను ప్రేమిస్తూందని తెలిసేటప్పటికే చాలా రోజులు పట్టింది నాకు. అది పొంగే వయస్సు. అవి భూమికి అందని ఆదర్శాల రోజులు. నేనూ అందరిలా పెండ్లి చేసుకుని, అందరు సంసారుల్లా బానిసబ్రతుకు బ్రతకటం హేయమనిపించింది. సముద్రంలో కాకి రెట్ట లాంటి మనిషిని నేను - అన్న నిజం ఆనాడు తెలియలేదు. ఎండమావుల్లాంటి ఆదర్శాలు రంగులు సృష్టిస్తూంటే, నన్ను కోరిన, నా అవసరం తెలిసిన ప్రియురాలి హృదయం నలిగిపోవటం గుర్తించలేదు నేను. నా మనస్సు నాకే తెలియలేదు. అపర్ణ తొందర, ప్రేమ నాకర్థం కాలేదు. అర్థమయ్యేటప్పటికి నన్ను దాటి చాలా దూరం

వెళ్లిపోయిందామె. చివరి ఆశగా అర్ధరాత్రి అప్పర్ణ నాదగ్గరి కొచ్చి, ''లేచిపోదాం, పద'' అన్నప్పుడుకూడా ఆమె నిస్పృహాయత గుర్తించలేదు నేను.

''ఇదేమిటి, ఇంత రాత్రప్పుడు వచ్చావు? పద, మీ ఇంటికి పంపించి వస్తాను.'' ఆమె తిరిగి వెళ్లటానికి రాలేదని నాకు తెలియదా? మేల్కొన్న వాణ్ణి నిద్ర లేపటం ఎవరి తరం? 'మన పెండ్లి అసంభవం' అని చెప్పేధైర్యంకూడా లుప్తమయిందేం!

అర్ధరాత్రి ఆమె నా దగ్గరకు రావటం వాళ్ల ఇంట్లో పసిగట్టారు. పెద్ద గందరగోళమే అయింది. ఆ తరువాత ఆమె మీద నిఘా ఎక్కువయింది. ఆ తరువాతి నెల్లో ఆమె పెళ్ళయి, మళ్ళీ ఎప్పుడో రైలుస్టేషన్లో కాబోలు బండెక్కుతూ ఆదరాబాదరగా రెండు మాటలు మాట్లాడింది. ఆ తరువాత మళ్ళీ ఈవేళే.

ఇంకా రోగులు వస్తూనే ఉన్నారు. రాత్రి పదిగంటలకుగాని మధుమూర్తికి నాతో మాట్లాడటానికి తీరిక దొరికలేదు.

''అన్నయ్యగారు ఎప్పుడూ రావటం?'' మధుమూర్తి భార్య లలిత ప్రశ్నించింది, ఇంట్లోకి వెళుతూనే. భార్యా భర్తలిద్దరూ అతిథి మర్యాదలు పెద్ద పెట్టున చేశారు.

మా చిన్ననాటి మధుర స్మృతులు నెమరు వేసుకుంటూ భోజనం పూర్తి చేశాం. నా భోజనమయిందన్నా వాళ్ళు వినకపోతే, రెండు మెతుకులు నంజాను. ఆ సుఖ వార్తాలాపం ఎక్కువ సేపు గడవనే లేదు. ఎక్కడినుంచో ఫోన్ కాల్ వచ్చింది - సీరియస్ కేస్. వెంటనే డ్రెస్ చేసుకుని కార్లో వెళ్లిపోయాడు మధుమూర్తి.

ఎయిర్ - కండిషన్డ్ గదిలో నా పడక ఏర్పాటు చేశారు. నిద్ర పోవాలన్న ప్రయత్నంలో అటూ ఇటూ పొర్లాను. సిగరెట్టు తీసి వెలిగించాను. సిగరెట్టు పొగ ఆలోచనల్లాగా రింగులు రింగులు చుట్టుకుంటూ పైకి పోతూంది.

మధుమూర్తి బ్రతకనేర్చినవాడు. తన జీవితానికి లలిత ఎంత అవసరమో గుర్తించిన మనిషి. ఆమె కోసం అబద్ధం చెప్పటానికీ సంకోచించని వ్యక్తి. లలిత తండ్రి ఆగర్భ శ్రీమంతుడు. అప్పట్లో మధుమూర్తి వాళ్ల కళ్లల్లో ఆనేట్టు లేడు. లలితకో ఫారిన్ రిటర్న్డ్ సంబంధం సిద్ధం చేసి పెట్టాడామె తండ్రి. హృదయాల్ని కలిపే పరమాత్మకు మానవుల అతిశయాలేం అర్థమవుతాయి! ఇంకెలానూ ఆమెను పొందే అవకాశం లేదనుకున్నప్పుడు మధుమూర్తి ఆమె తండ్రిని కలిసి చెప్పేశాడు - ''లలితా నేనూ ప్రేమించుకున్నాం. మా పెండ్లి చేసెయ్యం''డని.

అయితే, ఆయనంత తేలికగా లొంగిపొయ్యే ఘటంకాదు. సామదాన భేదదండోపాయాలన్నీ మధుమూర్తి పై ప్రయోగింప ప్రయత్నం చేశాడు.

''మీ ఇష్టం - మీ రేంచేసినా నాకభ్యంతరంలేదు. అయితే, మీ అమ్మాయికిప్పుడు రెండో నెల.

రెండో కంటి వాడికి తెలియకముందే పెండ్లి చేసెయ్యటం ఉత్తమం. ఆ తరువాత మీ ఇష్టం'' అన్నాడు చివరకు మధుమూర్తి.

కూతుర్ని పిలిచి అడిగాడు ఆయన. ఆమె 'నిజమే'నని ఒప్పుకోవటంతో ఆయన నడుము విరిగినట్లయింది. ఇంతవరకూ వచ్చాక వేరే ఏం ప్రయత్నం చేసీ ప్రయోజనం ఉండదని ఆయన క్రిందకు దిగి వచ్చాడు.

తరువాత మధుమూర్తి నాకీ విషయం చెప్పినప్పుడు నేను ఆవేశపడ్డాను.

''ఎంత కుట్ర పన్నావురా? కూతురి చేతే తండ్రికి ద్రోహం చేయిస్తావా? ఇంత మోసంతో ప్రారంభమయే మీ దాంపత్యం ఇంకెలాగుంటుందో... ఇదంతా నాకు నచ్చలేదు. నేను వెళ్లి ఆయనకు నిజం చెపుతాను.''

''ఏడ్చావ్‌లేకాని - సీదాగా మేం ప్రేమించుకున్నాం, పెండ్లి చెయ్యమంటే ఆయన ఒప్పుకునే వాడేనా! వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి. మోసం మా మనసుల్లో లేదు. మా దాంపత్యం మూడు పువ్వులూ, ఆరుకాయల్లా ఉంటుంది, చూస్తూ ఉండు'' అన్నాడు మధుమూర్తి.

నిజం. ఇవాళ్టి రోజు చూస్తూ ఉంటే వాడిలో ఎంత ధైర్యం, ఆత్మ స్థైర్యం ఉన్నాయో - జీవితాన్ని నేర్పుగా తస్కరించుకుపోతున్నాడు. పామో, తాడో తేల్చుకునే విచక్షణ వాడికి వుంది. వాడి దాంపత్యం మూడు పువ్వులూ ఆరుకాయలూ కాసింది. పిల్లలందరూ పెద్ద చదువులు చదువుతున్నారు. వాళ్ల వివాహం తరువాత మధుమూర్తి ఆమె తండ్రినుండి కానీకూడా ఆశించలేదు. ఇదంతా అతని స్వార్జితం. ఈవేళ అతను పేరు మోసిన సర్జన్.

ఇంత చొరవా, ధైర్యం నాలో లుప్తమయాయేం? రోగిష్టి భార్యా, చదువులో ఎక్కిరాని పిల్లలూ - ఎక్కడో, ఎక్కడో అడుసులో కాలు వేశాను.

ఎప్పుడో నిద్ర పట్టింది. మధుమూర్తి తిరిగి రావటంకూడా నాకు తెలియలేదు. ఆఫీసు పని నిన్ననే పూర్తయింది. మధుమూర్తిని చూడటంకూడా అయిపోయింది. పొద్దున్నే ప్రయాణానికి సిద్ధమయాను. మధుమూర్తి దంపతులిద్దరూ ఇంకా రెండు రోజులుండి వెళ్లమని బలవంతం చేశారు.

''ఈవేళ ఆదివారంకూడా కదరా? ఉండు. సాయంత్రం హాస్పిటల్ వగైరా బంద్. ప్రతి ఆదివారం సాయంత్రం మా రాణీవారికి కేటాయించాం. ఆవిడ ఇష్టం. ఎలా గడపదలుచుకుంటే అలా... ఈవేళ నువ్వుకూడా ఉండు. చాలా రోజులయింది నీతో ఫ్రీగా మాట్లాడి....''

''ఆయన మాటలకేంగాని, అన్నయ్యా, మీరు తప్పకుండా రెండు రోజులుండాలి. వదినగారుకూడా వచ్చినట్లయితే బాగుండేది. ఆవిడని మేము చూడటమే పడలేదు'' అన్నది లలిత.

''లేదమ్మా! మళ్లీ తప్పక వస్తాగా? నాకీమధ్య ఇటువేపు పని తగులుతూనే ఉంది. ఈసారి వచ్చినప్పుడో వారంరోజు లుండకుండా వెళ్లను. సరేనా...'' అన్నాను.

అపర్ణ నన్ను ఉండమని బలవంతం చేయలేని అశక్తత, వీళ్ల అమృత తుల్యమైన ఆత్మీయతా పూర్వక అభ్యర్ధన - రెండూ గుర్తించాను. అయినా, తప్పదు, వెళ్ళిపోవాలి. ఇలాంటి ఒయాసిస్సుల్లో కొత్త శక్తిని పుంజుకుని జీవితాన్ని సాగదీసుకోవాలి. కారులో వచ్చి నాకు వీడ్కోలిచ్చారు దంపతులిద్దరూ.

రాఘవుడినికూడా చూసి చాలా రోజులయింది. విజయవాడలో స్టేషను మాస్టరుగా ఉన్నట్లు ఇదివరకెప్పుడో వ్రాశాడు. ఎట్లాగో దోవలోనే కాబట్టి వాణ్ణి చూసివెళదామనుకున్నాను. బండి దిగేటప్పటికి చీకట్లు కమ్ముకున్నాయి. రైలు స్టేషనులో ఎంక్వైరీ చేసి వాడి ఇంటికి బయలుదేరాను. వాన తుంపర్లు పడుతున్నాయి. నేలంతా చిత్తడిగా ఉంది. వాతావరణం ఆహ్లాదకరంగా లేదు. కాస్త విరాకనిపించింది.

రాఘవరావు రైల్వే క్వార్టర్సులో ఉండటంవల్ల ఇల్లు కనుక్కోవటం కష్టమేం కాలేదు. రిక్షా వాడికి డబ్బులిచ్చిపంపి, ''రాఘవరావు, రాఘవరావు'' అని పిలిచాను. ఓ కుక్క 'భౌ భౌ'మని అరుచుకుంటూ నామీదకు దూకబోయింది.

''శామ్సన్... శామ్సన్.... ఏమిటి...?'' అని ఓ పాతికేళ్ల పడుచు కుక్కను అదుపులో పెడుతూ వచ్చింది, చిట్లిన గాజుబొమ్మలా. ఆమెని చూడగానే ఎందుకో అనిపించింది - ఆ తెలియని పిల్ల జీవన విపంచిలో తంత్రి ఎక్కడో, ఎవరో బలవంతంగా తెంపేశారని.

''రాఘవరావు ఉండే ఇల్లు ఇదేనా, అమ్మా?'' అని అడిగాను.

ఆమె తల ఊపింది.

''వస్తారు... కోర్చోండి...'' అని ఓ కుర్చీ చూపి లోపలికి వెళ్ళిపోయింది.

తెలిసినవాడని గుర్తించిన శామ్సన్ కాలి దగ్గరగా వచ్చి నాకటం మొదలెట్టింది. జీవితం ఓ కమనీయ కావ్యమేఅయితే, ఇంట్లో ప్రవేశించగానే కనిపించిన కుక్క ఓ సింబల్లా ఎన్నో అర్థాలను కలిగించింది నాలో. జీవితం మోసం చేస్తే అనాది మానవుడుగా పశుజాతి తోడి జీవితంలో మానవుడు అనుభవించిన ఏకతా సుఖాన్ని వెదుక్కుంటూ వెనకకు మళ్లేడా అనిపించిందో క్షణం.

అయిదు నిమిషాలకు మెళ్లో స్టెత్ తగిలించుకున్న డాక్టరూ, వెనక రాఘవరావూ కిట్ పట్టుకుని వచ్చారు. ఏమిటో ఆ అపశ్రుతి అనిపించింది. నన్ను చూసిన రాఘవరావు చిన్నగా నవ్వాడు. అంధకారంలో టార్చి వెలిగి, ఆరిపోయినట్లయ్యాడు నన్ను చూసి. డాక్టరు వెళ్లి పోయాడు.

రాఘవరావు వచ్చి కూర్చున్నాడు. నేనేం మాట్లాడలేదు.

''ఆవిడకేం బాగుండలేదు ఒంట్లో .... గుండెజబ్బు....'' రాఘవరావే అన్నాడు. నేను వచ్చిన క్షణం బాగుండలేదనుకున్నాను.

''ఏమంటాడు డాక్టరు...?'' అడిగాను.

''ఏమంటాడు... సున్నితమైన గాజు హృదయం ఎప్పుడైనా పగిలిపోవచ్చు. అసలు చిట్లనే కూడదుగాని...'' అన్నాడు మెల్లిగా.

వాన చినుకులు పెద్దవయాయి. గాలి విపరీతంగా వీస్తూంది. ఆకాశం ఉరుముతోంది. పైన శంపాలతలు విరిగి అనంత శూన్యంలో, అంధకారంలో విలుప్తమవుతున్నాయి.

''పద, చూద్దాం'' అన్నాను.

రాఘవరావు భార్యను చూసిన తరువాత పరిస్థితేం బాగుండలేదనిపించింది. సంవత్సరాల తరువాత, నా చిన్ననాటి మిత్రుడు రాఘవరావుని ఈ స్థితిలో చూస్తాననుకోలేదు. ఏక్షణంలో నయినా ఆ పంజరంలోని పక్షి ఎగిరిపోవచ్చు.

''మళ్లీ స్ట్రోక్ వస్తే లాభం లేదన్నాడు డాక్టరు...'' అన్నాడు రాఘవరావు, తిరిగి వస్తూంటే.

కాలం ఘనీభవించింది. భోజనానికి పిలిస్తే లేచి వెళ్లాము. రాఘవరావు పిలుస్తూంటే తెలిసింది, నేను ఇందాక చూసిన పడుచు పేరు 'విశాల' అని. ఆమే వడ్డిస్తూంది. రాఘవుడు ఆమెని పరిచయం చెయ్యలేదు. బహుశః కూతురేమో ననుకున్నాను. ఇద్దరమూ అంతంత మాత్రంగానే భోజనం అయిందనిపించాము.

పిల్లలెంతమందో, ఏం చేస్తున్నారో వివరంగా వాడిని గురించి తెలుసుకుందామని ఆతృతగా ఉంది. మధుమూర్తిని గురించి చెపుదామనీ ఉంది. అయితే, ఈ పరిస్థితిలో వాణ్ణేం పలకరిద్దామనిపించలేదు. అసలీ రాత్రి గడుస్తుందా అనిపించింది. వాడూ ఏం మాట్లాడలేదు.

వరండాలో పక్క లేసింది మా ఇద్దరికీ విశాల. సిగరెట్లు తాగుతూ, ఎవరి పక్కల్లో వాళ్లం పడుకుని ఆలోచిస్తున్నాం. ఇంకా వాన ఉద్ధృతంగానే కురుస్తోంది. అప్పుడప్పుడు వాన తుంపర మామీద పడుతోంది.

ముందు ఆవరణలో ఓచిన్న తోట పెంచినట్లున్నాడు రాఘవరావు. గాలికి, వానకు కొబ్బరిమట్టలు పిశాచాల్లా ఊగుతున్నాయి. శామ్‌సన్ యజమాని కాలు నాకుతూ మంచం మీదే చోటుచేసుకుని చీకట్లోకి చూస్తోంది. ఆ అమాయక జీవికూడా వాతావరణం బరువును అనుభవిస్తున్నట్లే ఉంది. లోపలగదిలో నుండి రోగి మూలుగు వినిపిస్తోంది.

ఎప్పుడో కునుకు పట్టినట్లుంది. ఏవో పీడకలలు. ఏదో అజ్ఞాత భయం. ఓ అర్ధరాత్రి నాలిక పిడచ కట్టుకుపోయిన అనుభూతి.

లోపల ఏదో కీచులాట.

''అక్కా, మందు తాగు!'' ఆపిల్ల గొంతు కాబోలు.

''మందూ వద్దూ, మాకూ వద్దూ! పాపిష్టి మొహందానా!'' ఆ గొంతులో అసహ్యం, బాధ మెలికలు తిరిగినట్లయినాయి. రక్తనాళాలు బ్రద్దలయిపోతాయేమోనన్న అనుభూతి.

''బావా... బావా!'' ఆ పిల్ల విలపించే కంఠంతో పిలుస్తోంది.

ఉలిక్కిపడి లేచాడు రాఘవరావు. దీపం కొడిగట్టబోతూంది. దీపాన్ని ఎగసనతోసే ప్రయత్నంలో ఆ తుఫానులో డాక్టరుకోసం పరుగెత్తాడు రాఘవరావు. మృత్యుముఖంలో ఒంటరి జీవి విలపిస్తోంది. ఆ పరిధిలోకి ఏ సహానుభూతిగల హృదయమూ ప్రవేశించలేక పోతోంది.

నిర్విరామంగా వర్షిస్తూంది ఆకాశం. జుట్టు విరబోసుకున్న దయ్యాల్లా ఊగుతున్నాయి చెట్లు. ఎలక్ట్రిక్ సప్లై ఫెయిలయినట్లుంది. చుట్టూరా గాఢాంధకారం. రోగి గదిలో చిన్న బెడ్‌లైటు ఎప్పుడు ఆరిపోదామా అన్న ఆత్రుతతో, ఆశలేని పలచటి వెలుగును వ్యాపింప జేస్తోంది. విశాల అక్క మంచం కోడుకు తల ఆన్చి నిశ్శబ్దంగా ఏడుస్తోంది. ఏదో భయంకర నీరవ నిశ్శబ్ద రహస్యం ఆమెలా ముడుచుకుపోయి విలపిస్తున్నట్లున్నది. రోగి మంచం మీద మెలికలు తిరుగుతున్నది. శామ్‌సన్ ఆతృతగా రోగి మంచం క్రిందుగా వెనక కాళ్ళమీద కూర్చుని, ముందు కాళ్ళని నేలకాన్చి యజమానురాలి వంక చూస్తోంది.

డాక్టరు చాలా యుగాల తరవాత ఆలస్యంగా వచ్చాడు. మానవాతీత శక్తి ఓ అల్ప మానవుడి కోసం ఎందుకు వేచి ఉంటుంది? డాక్టరు మంచులాంటి చల్లటి చెయ్యి వదిలేసి, మాట్లాడకుండా తడుసుకుంటూ కారులో వెళ్ళిపోయాడు. రాఘవరావు అవాక్కయి కుర్చీలో కూర్చుండి పోయాడు. పుట్టిన ప్రతిజీవీ చచ్చిపోతూనే ఉంది. యుగయుగాల నుండి ఈ కార్యక్రమం అనంతంగా సాగిపోతూనే ఉంది. తానూ చస్తాడని తెలిసినా, మానవుడు తాను చిరస్థాయిగా ఉంటాడనే భ్రాంతిపూర్వక అతిశయంలో కోరుకునే కోర్కెలూ, సుఖలాలసత్వమూ కంటే అద్భుతమేముంది? తెల్లవారు ఝామున ఎప్పుడో వాన ఆగిపోయింది. ఈవాన, అంధకారం అంతమవుతాయా అనిపించింది. పుట్టినవి నశించకేం చేస్తాయి? దూరంగా కప్పలు బెకబెక లాడుతున్నాయి.

ఇక తెల్లవారిన తరవాత నేనే లేచి నడుము కట్టుకోవలసి వచ్చింది. రావలసిన బంధువులెవరూ లేరు. ఎవరో ఇద్దరు ముగ్గురు వాడి కొలీగ్స్ మాత్రం వచ్చారు. ఆరోజు మధ్యాహ్నానికల్లా దహన సంస్కారం పూర్తిచేశాం.

రాఘవరావు భార్య నిర్యాణం తరువాత ఒక్క మాట మాట్లాడలేదు. ఆరోజు ఇంట్లో

పొయ్యిలో పిల్లి లేవలేదు. కారియర్ తీసుకుని వెళ్లి నేను తిని, వాళ్లిద్దరకూ హోటలునుండి భోజనం పట్టుకొచ్చాను.

నాకు ఎన్ని పనులున్నా ఆపుకొని, ఆ అవాంతర పరిస్థితుల్లో అక్కడే ఉండవలసి వచ్చింది. మళ్లీ రాత్రి వచ్చింది. నిన్నటి వర్షచ్ఛాయలు కూడా లేనంత నిర్మలంగా ఉంది ఆకాశం.

ఆవరణలో పచ్చి గడ్డిలో కూర్చున్నాము. చుట్టూ ఫెన్సింగ్‌కు ఉపయోగించిన 'యుఫర్బియా' జాతి మొక్కలు నల్లగా, ఎర్రగా ఉన్న ఆకులతో నీట్‌గా కత్తిరించబడి ఉన్నాయి. రాఘవరావు బయటకు వెళ్లి సోడాలూ, ఇంట్లో నుండి గ్లాసులూ పట్టుకువచ్చాడు.

''ఈ వేళో చుక్కేసుకుందాం'' అన్నాడు రాఘవరావు. నేనేం మాట్లాడలేదు. బాధకు లోనైన హృదయానికి ఏదైనా ఆసరా అవసరం.

రెండు గ్లాసుల్లో ద్రవం పంచి సోడా కలిపాడు. చెరో గ్లాసూ పుచ్చుకున్నాం. గ్లాసు నింపుతూనే ఉన్నాడు, తాగుతూనే ఉన్నాడు రాఘవరావు. నాకు వాణ్ణి ఆపాలనికూడా అనిపించలేదు.

శామ్సన్ యజమాని పాదాలు నాకుతూ, అక్కడే తచ్చాడుతోంది. రాత్రి పదిగంటలకే నిర్మానుష్యమయినట్లయింది రైల్వేకాలనీ.

గ్లాసు లోపలకు పోతున్నకొద్దీ రాఘవరావు మౌనం కరిగి మాటల రూపంలో వెలువడుతున్నది. కొన్ని కొన్ని అర్థమవుతున్నాయి. ఆ నల్లటి ద్రవపు వెల్లువలో తెలిసింది - ఆ పిల్ల విశాల - రాఘవరావు మరదలే కాదనీ, రెండో పెళ్ళాంకూడాననీ.

''కొన్ని కొన్ని నిజాలు భయంకరంగా ఉంటాయిరా, శంకరం! ఆరేళ్లప్పుడు తల్లిపోతే సాకిన నాకూ, మా ఆవిడకూ అప్పుడు తెలియలేదు. పిల్లల్లేని కొంపలో ఓ పిల్లగా ఉంటుందనుకొన్నాం. పెళ్లామవుతుందని ఏం తెలుసు? ఓ పైశాచిక క్షణంలో ఆ పిల్లని చెడిపేశాను. ఆ తరవాతగానీ తెలియలేదు - జీవజాతిలో కోల్పోయిన శక్తిని పునరుజ్జీవింప చేసే మహాశక్తి మానవుడికి తిరస్కరించబడిందనీ, మానవుడి కృత్రిమత్వంలో ప్రకృతి చచ్చిపోయిందనీ...''

నేనేం వాడి మాటలకు అంతరాయం కలిగించలేదు. ఆ భయంకర నిజాన్ని భరించటానికి మరో గ్లాసెడు ద్రవం గళంలోకి పోసుకున్నాను. గ్లాసులో నుండి మరో గుటక వేసి మళ్ళీ మొదలెట్టాడు రాఘవరావు! ''ఈ తాగుడు ఈవేళ కొత్తకాదు. ఎప్పుడు మొదలెట్టాను - ఆ పిల్ల పిల్ల తల్లి అవుతుందని తెలిసినప్పుడు. పార్వతి చెల్లెల్ని పెళ్లాడమంది. తప్పలేదు. అయితే, ఆ శుభకార్యం ఇంట్లో ఎవరికీ శాంతి కూర్చలేకపోయింది. పుట్టిన పిల్లాడు పురిటిలోనే పోయాడు. ఆవిడ చేసిన త్యాగానికి హృదయం తట్టుకోలేక పోయింది. గుండె పగిలి చచ్చిపోయింది. నేచేసిన తప్పు క్షణ క్షణమూ నాకు నరకాన్ని ప్రసాదించింది. ఆ నరకంలో ధర్మరాజులా, ఇదుగో ఈ సీసా ఓ ఉపశమనం. మా ఇద్దరి హృదయాల మధ్య విశాల రోజు రోజుకూ కుంచించుకుపోతూంది... చెప్పరా, శంకరం, నువ్వు నన్ను అసహ్యించుకుంటున్నావుకదూ?''

పోను పోను మాటలు ముద్దలు తేలుతున్నాయి. నాలోని అణువణువు మూలంలో నుండి శాంతిని పెకలించి వేసినట్లనిపించింది. ఏదో అసహ్య భావన కదలాడింది. కాని, అంతలోనే అంతటి అంధకారంలోనూ వాడి చచ్చిపోని అంతరాత్మ దీపంలా వెలుగుతూ నాకు దర్శనమిచ్చింది. వెంటనే నేను చేస్తున్న తప్పిదం ఏమిటో కళ్ళకు కట్టినట్లయింది. నేనూ రాఘవరావు కంటె తక్కువ పాపం ఏం చేయటంలేదు. పోగొట్టుకున్న దాన్ని, అందనిదాన్ని ఊహించి, ఉన్నదాన్ని పోగొట్టుకుంటున్నాను. రజ్జువును చూసి పామనుకొని భయపడ్డాను. అపర్ణ ప్రేమలో సుఖముందన్న లాలస, నా భార్య అర్పణలో ఉన్న సుఖాన్ని హరించేసింది. ఆమెని నిర్లక్ష్యం చేశాను. నా కోసం నిరీక్షించి, నిరీక్షించి రోగగ్రస్థురాలైంది. నా పిల్లల్ని అందరి తండ్రుల్లా, ఆత్మీయతతో, ప్రేమతో ఎప్పుడైనా దగ్గరకు తీశానా? వాళ్లని గురించి ఏమాత్రం శ్రద్ధ తీసుకున్నా వాళ్లలా పనికిమాలిన వాళ్లలా అయ్యేవాళ్లా? ఈవేళ అర్థమవుతూంది - నేనూ రాఘవరావు నించున్న కూపం దగ్గరే నిలబడి ఉన్నాను. ఇంక జారిపడటం ఎక్కువ సేపు పట్టదు. కొందరికి తాము చేసే కిరాతకం కళ్లకు కట్టినట్లు కనపడితేగాని, ఆ కృత్యంలోని భయంకరత్వం, నిర్దాక్షిణ్యం అనుభవంలోకి రావు. అపర్ణ, మధుమూర్తి జీవితాన్ని జీవితంలా తీసుకుని అనుభవించారు. వాళ్ళకు తాడేదో, పామేదో నన్న విచక్షణ ఉంది. వ్యభిచరించటం, దొంగతనం పాపాలనుకోను. అంతకంటే క్రూరమైనదేదో, అంతరాత్మ వ్యతిరేకించినది చేస్తున్నాం. ఆత్మని అమ్ముకొన్న మరుక్షణంలోనే నిజమైన పతనం మొదలౌతుందన్న నగ్న సత్యం నాకనుల ముందు మెదిలింది.

చల్లగాలి వీస్తూంది. విశాల లోపల పడుకుని నిద్ర పోతున్నట్లుంది. శామ్‌సన్ ఫెన్సింగ్ వారగా నడుస్తూ భౌభౌ మని అరుస్తోంది. ''శామ్‌సన్, శామ్‌సన్!'' అని రెండు సార్లు పిలిచాడు రాఘవరావు. అది వాడి వైపు తిరగలేదు. ఇంకా అరుస్తూనే ఉంది.

''చెప్పిన మాట వినవేమిట్రా... నీ ఆగడమెక్కువయింది. కట్టేస్తే కాని నీ పొగరణగదు'' అని ఫెన్సింగ్ పక్కగా పడి ఉన్న తాడుని తీసుకుని కుక్కని కట్టెయ్యబోయాడు.

అయితే, అది తాడుకాదు, పాము. బుస్సుమని వచ్చి అతన్ని కాటువేసింది. అంతలో శామ్‌సన్ పాముని పళ్లమధ్య ఇరికించుకొని కసుక్కున కొరికి రెండు ముక్కలు చేసింది. వీధిలైటు మసక వెలుగులో నేనంతా చూస్తూనే ఉన్నాను. క్షణాల్లో జరిగిపోయింది. ఏం చేయాలో తోచలేదు. ఓ క్షణం అవ్యక్తుడనై చూస్తుండిపోయాను.

మరుక్షణంలో వాడి మణికట్టు జేబుగుడ్డతో బిగించి కట్టాను. మనిషి అప్పుడే కొంచెంగా వాలిపోతున్నాడు. భుజం మీద చేయివేసుకుని లేవనెత్తి బయటకి తీసుకువచ్చాను. విశాలని లేపాలని కానీ, ఇంటి తలుపులు వేయాలనికానీ ఆలోచనే రాలేదు. ఈ అపరిచితమైన ఊళ్లో ఈ రాహుగ్రస్తుణ్ణి ఏ డాక్టరు ఇంటికి తీసుకువెళ్లాలో అర్థం కాలేదు. ఆపద్బాంధవుడులా ఓ రిక్షా అతడు పోతూ కనిపించాడు.

''నీకు తెలిసిన డాక్టరు ఇంటికి వేగం పోనీవోయ్... ఇతను చావు బతుకుల్లో ఉన్నాడు'' అని

రాఘవుణ్ణి నేనూ, రిక్షా అతనూ సాయం పట్టి రిక్షాలో కూర్చో పెట్టాం. నేను పట్టుకుని పక్కన కూర్చున్నాను.

ఎక్కువ దూరం లేదు డాక్టరు ఇల్లు. త్వరలోనే చేరాము. ఆయన రాఘవుడి భార్య పార్వతికి వైద్యం చేసిన డాక్టరే. ఏం ఉపోద్ఘాతం లేకుండా నేను ఉన్నది రెండుమాటల్లో వివరించి చెప్పాను. డాక్టరు పల్సు, హార్టూలు అదీ పరీక్షించి ఏదో ఇంజెక్షనిచ్చాడు. ఓ అర్ధగంట వాడికేసి ఆత్రుతగా చూస్తూ కూర్చున్నాం. కాలం జెర్రిగొడ్డులా మెల్లగా సాగిపోతూంది. ఏమవుతుంది అన్న భయంకర ఆలోచన నన్ను తినేస్తోంది. ఇలా వీడి దారి వీడు చూసుకుంటే విశాల గతి ఏమిటి? రిక్షా వెనుక పరుగెత్తు కొచ్చిన శామ్‌సన్ రొప్పుతూ టేబిల్‌మీద పడుకునున్న యజమాని వంక ఆయాసంతో చొంగ కార్చుకుంటూ ఆదుర్దాగా చూస్తోంది.

అరగంట, ముప్పావుగంటకు కాబోలు డాక్టరు మళ్ళీ హార్టు, లంగ్స్, పల్స్ పరీక్ష చేశాడు. మళ్లీ ఏదో ఇంజెక్షన్ ఇచ్చాడు. ఇలా గంట గంటన్నర దాకా చికిత్స చేస్తూనే ఉండిపోయాడు. ఆ తరువాత నవ్వుతూ, ''మీ వాడి నరాల్లో రక్తం కాదండీ ప్రవహిస్తూంట, బ్రాందీ! అసలు విషమెక్కందే. ఇతన్ని కరిచిన పాము అదే చచ్చి ఉండాలి. మీ మిత్రుడు సలక్షణంగా ఉన్నాడు. అయితే, కాస్త డోసు ఎక్కువయి కొంచెం మత్తులో ఉన్నాడు. మీరు ఇంటికి తీసుకువెళ్లవచ్చు'' అన్నాడు.

నేను దిగ్భ్రమగా చూస్తూండి పోయాను. మళ్ళీ వాణ్ణి ఇంటికి తీసుకువచ్చేటప్పటికి తెల్లవారు ఝామయింది. విశాలకంతా వివరించి చెప్పాను!

ఇక నాకక్కడ ఓ క్షణంకూడా ఉండబుద్ధి కాలేదు. పొద్దున్న ఆరు గంటలకు బండికూడా ఉంది. వెళ్లిపోవాలి. మళ్లీ వాడికి మెలకువ వస్తే పోనిస్తాడో, పోనివ్వడో... ఓ కాగితం మీద రెండు ముక్కలు గిలికాను.

''రాఘవుడూ! నిన్నీ వేళ చూసిన పరిస్థితుల్లో చూసిన నాకు, మనం చేస్తున్న తప్పేమిటో నాకవగాహన అయింది. సుఖాభాసే నిజమనుకొని సుఖాన్ని త్యజించాం. సర్పం రజ్జువుగా ఆభాసించింది. సర్పం సర్పంగా గోచరించిన మరుక్షణం అంతకంటే భయంకరత్వ మేముంటుంది? అందుకని పాముని తాడే అనుకుని వంచించుకు పోవాలని ప్రయత్నించాం. పాము కాటెయ్యకేం చేస్తుంది! జీవితం కాటేసింది. అక్కడికా అంగాన్ని ఖండించి ముందుకు సాగటమే కర్తవ్యం.

అసహ్యించుకుంటున్నావా అని అడిగావు. ఇద్దరం ఒకే గోతిలోకి దిగిన అంధపాంథులం. ఎవరు ఎవర్ని అసహ్యించుకునేట్టు!

'నీ నరాల్లో ప్రవహించేది రక్తం కాదు, బ్రాందీ' అని చెప్పాడు డాక్టరు. రక్తం జీవలక్షణం. దాన్ని పాడు చేయకు. ఇంక... వద్దు ... వద్దు. జీవితాన్ని మైక్రోస్కోపు క్రింద పెట్టి పరీక్ష

వెయ్యటం మానెయ్యి. గడిచిన దానికి వగచి ప్రయోజనం లేదు. విశాల నీకోసం ఎదురు చూస్తూంది. జీవితంలో నేర్పుగా ఎగబడకపోతే అదే నీపై కెగబడి నిన్ను కబళించివేస్తుంది. ఇప్పటికీ ఆలస్యం కాలేదు. జీవించటం మొదలెట్టు. అరుణోదయమయింది. నే వెళుతున్నాను. నేర్పుగా బ్రతకటానికి వెళుతున్నాను.

నీ

శంకరం''

ఆ ఉత్తరం విశాల చేతికిచ్చి వాడికివ్వమన్నాను.

''చూడు, తల్లీ! నీకు నే తెలియదుగానీ, నువ్వు నాకు తెలుసునమ్మా! రాత్రి పరిస్థితినంతా వివరించా కదా? ఇక నీ ఇష్టం. పోయిందేదో పోయింది. ఉన్నదాన్ని పోగొట్టుకోకు. నీకు వాడిలో విషం తెలుసు. అమృతభాండం కూడా ఉంది. తల్లీ! దాన్ని వెలికి తీసి నువ్వనుభవించి, అందరికీ పంచిపెట్టవలసిన బాధ్యత ఇక నీదే! వెళతాను.... కాదు, వెళ్లొస్తాను. మళ్లీ వచ్చేటప్పటికి నీ కళ్లలో ఈ నిరాశ, నిస్పృహ కాదు, ఆనందజ్యోతుల్ని చూడాలి.'' అన్నాను విశాలతో

గడప అవతల తలుపు కానుకొని మౌనంగా, అవనతముఖి అయి నిలబడివుంది విశాల. ఇంటికెదురుగా సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఆ ఉదయభానుడి కిరణమొకటి ఆమె కనుకొలకుల్లో నిలబడ్డ అశ్రుకణంలో తళుక్కుమని మెరిసింది. ఆ కన్నీటి చుక్క ముత్యమే అయిందో, అందులో ఇంద్రధనుస్సులే విరిశాయో అవన్నీ నా మిత్రుడికి వదిలేసి, తూర్పు దిక్కుగా రైల్వే స్టేషను వైపు వడివడిగా నడుచుకుంటూ ఉత్సాహంగా సాగిపోయాను.

'ఆంధ్రప్రభ' సచిత్రవారపత్రిక

17-1-1973


With best compliments from

HINT TRANSFORMER CO.

B-13, I D A, KUKATPALLY, HYDERABAD

Sri Ramakrishna Rao

Phone : 273349